

ఎక్సకవేటర్ సాయంతో టిప్పర్‌లో మట్టి పోస్తున్న దృశ్యం



చెరువులో నుంచి మట్టి తరలిస్తున్న ట్రాక్టర్



మట్టిని తరలిస్తున్న టిప్పర్ లారీ

ఐదు ఇసుక లారీల పట్టివేత

ఏర్పేడు మండలం గోవిందవరం సబ్ స్టేషన్ సమీపంలో నిల్వ ఉంచిన ఇసుకను కొంతమంది లారీల ద్వారా తరలించడానికి ఆదివారం రాత్రి యత్నించారు. సమాచారం అందుకున్న వికృతమాత మాజీ సర్పంచ్ హేమాక్షిరాయల్ తన అనుచరులతో అక్కడికి చేరుకుని లారీలను అడ్డుకున్నారు. పోలీసులకు సమాచారం అందించి ఐదు లారీలను వారికి అప్పగించారు. తరలింపు వెనుక ఉన్న వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.



యథేచ్ఛగా మట్టిదందా

● వైసీపీ తరహా దోపిడీ కొనసాగింపు

తిరుపతి/ఏర్పేడు, సెప్టెంబరు 15: ప్రభుత్వం మారినా వైసీపీ నాయకుల మట్టి దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నేషనల్ హైవే నిర్మాణానికి రేణిగుంట మండలం మల్లిమడుగు డ్యాం వెనుక భాగంలో గుట్టను తవ్వుకోవడానికి అప్పటి కలెక్టర్ అనుమతిచ్చారు. హైవే నిర్మాణం మాటున మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి,వైసీపీ మండల నాయకులు ఐదేళ్ల మట్టిని అక్రమంగా తరలించి కోట్లు సంపాదించుకున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రభుత్వం మారి మూడు నెలలు కావస్తున్నా అదే స్థాయిలో దోపిడీ సాగుతోంది. ఏకంగా భారీ మిషనరీతో గుట్టను తవ్వేస్తున్నారు. సగానికి పైగా గుట్ట కరిగిపోయింది. ఈ మట్టిని ప్రైవేటు కాంట్రాక్టర్లకు, వెంచర్లకు లోడు టిప్పర్ లారీ రూ.20వేలకు విక్రయిస్తున్నారని సమాచారం. అలాగే ఏర్పేడు మండలంలోని కేంద్రీయ విద్యాసంస్థ ఐసర్ ప్రహరీకి ఆనుకుని ఉన్న చెరువులో మట్టిని తిరుపతికి చెందిన ఓ వ్యక్తి వెంచర్‌కు తరలిస్తున్నారు. జంగాలపల్లి పంచాయతీ శివగిరిపల్లి చెరువులో మట్టిని ఎక్స్‌కవేటర్ల సాయంతో టిప్పర్లు, ట్రాక్టర్లలో నింపి తరలించేస్తున్నారు. రెండు రోజులుగా ఈ దందా సాగుతోంది. రోజుకు సుమారు 200 టిప్పర్ల మట్టిని తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఇక ఫ్రెండ్లీ ఎస్ఆర్వోలు

కార్యాలయాల్లో రాచరికపు పోకడలు తొలగింపు

ప్రజలకు చేరువగా సబ్ రిజిస్ట్రార్లు

తిరుపతి, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి) : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో (ఎస్ఆర్వో) రాచరికపు పోకడలకు స్వస్తి పలికేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం జిల్లాలో అమల్లోకి వచ్చింది. ఆదివారం సెలవు అయినప్పటికీ జిల్లాలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పోడియం, రాజదర్బార్ లాంటి కుర్చీలను తొలగించారు. పార్టీషన్ తీసేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్నట్టుగానే సబ్ రిజిస్ట్రార్ల కుర్చీ, టేబుల్‌తో పాటు కార్యాలయానికి వచ్చేవారు కూర్చునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భూముల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చేసే ప్రజలకు తగిన గౌరవం ఉండాలని కూటమి ప్రభుత్వం భావించింది. న్యాయస్థానాల్లో జడ్జిల తరహాలో సబ్ రిజిస్ట్రార్లు కూర్చొనే విధానానికి చెల్లుచీటి పలికింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆలస్యమైతే వారికి మంచినీరు, టీ ఆఫర్ చేసి గౌరవించాలని నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా ఉత్తర్వుల మేరకు వెంటనే పనులు ప్రారంభించామని జిల్లా రిజిస్ట్రార్ శ్రీరాములు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి చెప్పారు. జిల్లాలోని 16 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దాదాపుగా తొలగింపు పనులు పూర్తి చేశామన్నారు. సోమవారం ప్లాస్టింగ్ వంటి సివిల్ పనులు పూర్తి చేసుకుని, మంగళవారం నుంచి ఫ్రెండ్లీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు చూస్తారని చెప్పారు.





తిరుపతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పోడియంతో కూడిన ప్రత్యేక ఛాంబర్ - ఆదివారం వాటిని తొలగించిన దృశ్యం

వంట నూనెలపై దిగుమతి సుంకం పెంచినట్లు కేంద్రప్రభుత్వం ప్రకటించడమే తరువాయి. ధరలు అమాంతంగా పెరగడం ప్రారంభమయ్యాయి. శని, ఆదివారాలకే లీటరుపై రూ.15 నుంచి రూ.20 వరకు పెరిగాయి. వంట నూనె ధరల పెంపుతో గృహిణుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.



కొత్త సరుకులపై కాకుండా నిల్వవున్న సరుకును కూడా అధిక ధరలకు విక్రయించడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఎక్కువ మంది ఉపయోగించే పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ ధరలు భారీగా పెరిగాయి. శని, ఆదివారాల్లో దుకాణాలకు వెళ్లిన వినియోగదారులకు రిక్తహస్తాలు ఎదురయ్యాయి. ఇదే అదునుగా కొందరు వ్యాపారులు నోస్టాక్ బోర్డును పెట్టి డిమాండ్ సృష్టిస్తున్నారు.

- తిరుపతి(నేరవిభాగం)/తడ / నాయుడుపేట



వంటనూనెలు సలసల!

● లీటరుపై రూ.25వరకు ధర పెంపు

గాడితప్పనున్న బడ్జెట్

సన్‌ఫ్లవర్ నూనె 15 లీటర్ల డబ్బా ఖరీదు శుక్రవారం వరకు రూ.1730. శని, ఆదివారాలకంతా రూ.2000కు చేరింది. లీటరు ప్యాకెట్ ధర రూ.108 నుంచి రూ.125-130కి ఎగబాకింది. అంటే లీటరుపై రూ.17 నుంచి రూ.23 వరకు పెరిగింది. 15 లీటర్ల పామోలిన్ నూనె డబ్బా ధర మొన్నటి వరకు రూ.1530 ఉండగా, ఇప్పుడది రూ.1730 దాటింది. మొన్నటి వరకు లీటరు ధర రూ.95 ఉండగా, శనివారానికి రూ.115కు చేరగా లీటరుకు రూ.20 వరకు పెరిగింది. వంటనూనెలు లేకుండా ఆహారపదార్థాల తయారీని ఊహించలేము. ఇప్పుడా వంటనూనె ధరల పెరుగుదలతో సామాన్య, మధ్యతరగతుల వంటింటి బడ్జెట్ ఒక్కసారిగా గాడితప్పే పరిస్థితి ఏర్పడింది. పూజలకు వినియోగించే వివిధ రకాల నూనెల ధరలు కూడా అమాంతం పెంచేశారు. మొన్నటి వరకు లీటరు ధర రూ.100 - 110 వరకు వుండగా, అవి ఇప్పుడు రూ.125-130కి చేరాయి.

నెలకు రూ.4 కోట్ల అదనపు భారం

తిరుపతి జిల్లాలో ప్రజలపై నెలకు దాదాపు 26.50 లక్షల వంటనూనె ప్యాకెట్లు వినియోగిస్తున్నట్లు హోల్‌సేల్ డీలర్లు అంచనా వేశారు. ఒక్కసారిగా లీటరుపై కనిష్ఠంగా రూ.15-20 పెరిగినందున నెలకు రూ.4 కోట్ల వరకు అదనపు భారం పడనుంది. దసరా, దీపావళి వంటి ముఖ్య పండుగలు వరుసగా ఉన్న నేపథ్యంలో నూనె వాడకం భారీగా పెరుగుతుంది.

కల్తీకి రెక్కలు

మార్కెట్‌లో వంటనూనె విడి విక్రయాల పేరుతో కల్తీకి అవకాశముంది. రోడ్డు పక్కన ఉండే టిఫిన్ సెంటర్లు, చిన్న హోటళ్ళు, మాంసాహార భోజనం తయారీ దారులు ఎక్కువగా విడి నూనెనే కొనుగోలు చేస్తుంటారు. ఈ విడి విక్రయాలను అడ్డం పెట్టుకుని కొంత మంది కల్తీలు విక్రయించే అవకాశాలున్నాయి.

బ్లాక్ మార్కెట్‌కు తరలింపు

కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం పెంచనుందన్న సమాచారంతో మిల్లుల యజమానులు, వ్యాపారులు వంట నూనెలను బ్లాక్ మార్కెట్‌కు తరలించేశారు. రెండ్రోజుల క్రితం డబ్బులు చెల్లించుకుని శనివారం డెలివరీ ఇవ్వాల్సిన ట్యాంకర్లకు సంబంధించి మొత్తాన్ని వ్యాపారులకు వ్యాపార సంస్థలు వెనక్కి ఇచ్చేశాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా డబ్బు చెల్లిస్తే సరఫరా చేస్తామని షరతు విధించాయి. దీంతో హోల్‌సేల్, రీటైల్ వ్యాపారులు పెరిగిన ధరల ప్రకారమే విక్రయాలు ప్రారంభించారు. పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ మలేసియా నుంచి మన దేశానికి ఎక్కువగా దిగుమతి అవుతుంది. శని, ఆదివారాలు సెలవులతోపాటు సోమవారం మలేసియా మార్కెట్‌కు సెలవుదినం కావడంతో మంగళవారం వరకు ఆ ధరల పెరుగుదలపై స్పష్టత వచ్చే ఆస్కారం లేదు. సుంకం 12.5 శాతం నుంచి 32.5 శాతానికి పెరిగే అవకాశముందని తెలుస్తోంది.

ఐదుగురు డీఎస్పీలకు పోస్టింగ్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 15: జిల్లాలో ఖాళీగా ఉన్న సబ్ డివిజన్లకు డీఎస్పీలను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. పల్నాడు మహిళా పోలీసు స్టేషన్‌లో డీఎస్పీగా పనిచేస్తున్న బి.ప్రసాద్‌ను చంద్రగిరికి, సీఐడీ విభాగంలో పనిచేస్తున్న ఏనుగంటి శ్రీనివాసరావును రేణిగుంటకు, ఏసీబీలో పనిచేస్తున్న వి.గిరిధర్‌ను తిరుపతి స్పెషల్ బ్రాంచ్‌కు, వీఆర్‌లో ఉన్న డి.మురళీధర్‌ను తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్సుకు, రాజగోపాల్ రెడ్డిని తిరుపతి పీటీసీకి నియమించింది.

కలెక్టరేట్‌లో నేటి పీజీఆర్ఎస్ రద్దు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 15: తిరుపతి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం రద్దయింది. మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా సోమవారం ప్రభుత్వ సెలవుదినం కావడంతో పీజీఆర్ఎస్‌ను రద్దు చేసినట్టు కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమం కూడా రద్దయినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు.

కన్నులపండువగా కల్యాణం

● వరసిద్ధుడికి టీటీడీ తరపున పట్టు వస్త్రాలు



ఐరాల(కాణిపాకం),సెప్టెంబరు15: కాణిపాక క్షేత్రంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి వినాయకస్వామి కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. రథోత్సవం మరుసటి రోజున తన మానస పుత్రికలైన సిద్ధి,బుద్ధిలతో పెళ్లిపెద్దగా బ్రహ్మ వ్యవహరించి వినాయకస్వామికి వివాహం జరిపిస్తారని భక్తుల నమ్మకం. ఉదయం ఉభయదారులైన కాణిపాకం, తిరువణంపల్లెలకు చెందిన వణిగ వంశస్థుల ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. అనంతరం కాణిపాక పుర వీధుల్లో కలశాలతో పాలను తీసుకొని ఊరేగించారు. అలంకార మండపంలో సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవర్లకు పాలాభిషేకం నిర్వహించారు.కల్యాణోత్సవ సందర్భంగా టీటీడీ తరపున ఈవో శ్యామలరావు వరసిద్ధుడికి పట్టు వస్త్రాలను అందజేశారు. రాత్రి అలంకార మండపంలో ప్రత్యేక కల్యాణ మండప వేదికపైకి వధూవరులను తీసుకొచ్చి మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా స్వామి వివాహం జరిపించారు.

అమ్మవారి పవిత్రోత్సవాలకు అంకురార్పణ

తిరుచానూరు, సెప్టెంబరు 15: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి పవిత్రోత్సవాలకు ఆదివారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ గావించారు. సోమవారం నుంచి మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు జరగనున్నాయి. ఆదివారం ఉత్సవాలకు విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ గావించారు. అంతకు ముందు ఫ్రైడే గార్డెన్ నుంచి అర్చకులు పుట్టమట్టిని ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. సోమవారం పవిత్ర ప్రతిష్ఠ, మంగళవారం పవిత్ర సమర్పణ, బుధవారం పూర్ణాహుతితో ఉత్సవాలు ముగియనున్నాయి. భక్తులు ఒక్కొక్కరు రూ.750చెల్లించి ఒకరోజు పవిత్రోత్సవాల ఆర్జితసేవలో పాల్గొనవచ్చు. 2లడ్డూలు, 2వడలు బహుమానంగా అందిస్తారు. ఆలయంలో ఆర్జిత సేవలు టీటీడీ రద్దు చేసింది.



పుట్టమట్టిని సేకరిస్తున్న అర్చకులు

శివయ్యా... ఇదేందయ్యా!

ప్రదోష క్షేత్రంలో వైసీపీ నేత కుమార్తె నిశ్చితార్థ వేడుక

కుర్చీలు వేసి మరీ ఆహ్వానితులను కూర్చోబెట్టడంపై విమర్శలు



ప్రదోష క్షేత్రం వద్ద కుర్చీల్లో కూర్చున్న బాలాజీ రెడ్డి బంధుమిత్రులు

నాగలాపురం, సెప్టెంబరు 15 : నాగలాపురం మండలంలో ప్రసిద్ధిగాంచిన సురుటుపల్లె పల్లికొండేశ్వర ఆలయంలో ఆదివారం ఆలయ మాజీ ఛైర్మన్,వైసీపీ నాయకుడు బాలాజీ రెడ్డి కుమార్తె నిశ్చితార్థ వేడుక జరిగింది.భక్తులు పవిత్రంగా భావించే ప్రదోష క్షేత్రం వద్ద ఎంతటి వారైనా నందీశ్వరుడి ఎదుట నేలపై కూర్చుంటారు. అయితే నిశ్చితార్థ కార్యక్రమానికి వచ్చిన బంధుమిత్రులను, రాజకీయ ప్రముఖులను స్వామివారి సన్నిధి ఎదుట వందకు పైగా కుర్చీలు వేసి కూర్చోబెట్టి కార్యక్రమాన్ని ఎంతో ఆర్భాటంగా చేయడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ ఆలయంలోని ప్రదోష క్షేత్రంలో పదిహేను రోజులకొకసారి వైభవంగా ప్రదోష పూజలను నిర్వహిస్తారు.ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చే వీవీఐపీలు, రాజకీయ ప్రముఖులు పాల్గొని గంటల కొద్దీ స్వామి వారి ఎదుట నేలపై కూర్చుంటారు.సాధారణంగా ఈ ఆలయంలో శుభ కార్యక్రమాలను ఆలయ ఆవరణలోని దేవస్థాన మండపంలో నిర్వహిస్తారు. ఒక వేల చిన్న పాటి శుభ కార్యక్రమాలను ప్రదోష క్షేత్రంలో నిర్వహించినా.. కార్యక్రమానికి వచ్చే వారు నేలపై కూర్చునేవారు. అయితే బాలాజీ రెడ్డి ప్రదోష క్షేత్రంలో కుర్చీలు వేసి మరీ ఆహ్వానితులను కూర్చోపెట్టడంపై భక్తులు మండి పడుతున్నారు.అంతే కాదు... పల్లికొండేశ్వరాలయంలో భక్తుల సౌకర్యార్థం దాతల సాయంతో నూతన వసతి గృహాలను ఏర్పాటు చేశారు.అయితే వీటిని ఇంతవరకూ ప్రారంభించక పోయినా.. నిశ్చితార్థ కార్యక్రమానికి వచ్చినవారి కోసం ఈ గదులను ఉపయోగించడం గమనార్హం.

తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 15: పౌర్ణమి పర్వదినం పురస్కరించుకొని తిరువణ్ణామలైకి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశామని సీటీఎస్ ఏటీఎం డి.రామచంద్రనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 4గంటల నుంచి ప్రత్యేక బస్సులు ప్రారంభమవుతాయన్నారు.బుధవారం వేకువజామున 3గంటల వరకు కొనసాగుతాయి. ప్రయాణికుల సౌకర్యార్థం రిజర్వేషన్ సౌకర్యంతో పాటు నేరుగా వచ్చినవారికి కూడా నాన్‌ఏసీ, ఏసీ బస్సులను అందుబాటులో ఉంచనున్నారు. ముందస్తు రిజర్వేషన్ ద్వారా రాకపోకలకు టిక్కెట్ బుకింగ్ చేసుకుంటే 10శాతం రాయితీ సదుపాయం కల్పించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు





హిమాన్షు శుక్లా - శోభారాజ్ - సుబ్రహ్మణ్య శర్మ

తిరుమల, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి):తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో..సమాచార శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్ల,ఐఏఎస్ అధికారి కృతిక శుక్ల,ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు,ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, ప్రముఖ గాయకురాలు శోభారాజ్, నటుడు చేతన్ చేను, మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ మనవడు సుబ్రహ్మణ్య శర్మ ఉన్నారు.వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

ముగిసిన గణేశ నవరాత్రులు : నేడు నిమజ్జనం



తిరుమల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠంలో తొమ్మిదిరోజుల పాటు జరిగిన గణేశ నవరాత్రి ఉత్సవాలు ఆదివారం మహా పూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. ఈ నెల 7వ తేదీన వినాయక చవితిరోజున ఈ నవాహ్నిక కార్యక్రమం ప్రారంభమైన విషయం తెలిసిందే. ప్రతిరోజూ వినాయకుడిని వేర్వేరు అలంకారాల్లో పలు వాహనాలపై పూజించారు. చివరి రోజు ఆదివారం సిద్ధిబుద్ధి గణపతి మూషిక వాహనంపై అనుగ్రహించారు. సాయంత్రం ధ్వజా వరోహణం నిర్వహించారు. ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠంలో ప్రిన్సిపాల్ కేఎస్ఎస్ అవధాని ఆధ్వర్యంలో వేదవిద్యార్థులు గణేశ విగ్రహాన్ని తయారు చేసి పూజలు చేశారు. విద్యార్థులు నిర్వహించే వివిధ పూజల ఏర్పాట్లు, నిర్వహణను అధ్యాపకులు పరవేక్షించారు. ఇక గణపతి విగ్రహానికి ప్రత్యేక పంచామృత అభిషేకం చేసిన అనంతరం సోమవారం ఉదయం 9 నుంచి 11 గంటల మధ్య నిమజ్జనం నిర్వహించనున్నారు.



తిరుమలలో మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి



తిరుమల, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి శ్రీవారి దర్శనార్థం ఆదివారం తిరుమలకు చేరుకున్నారు. రాత్రి 10.30 గంటలకు తిరుమలలోని శ్రీకృష్ణ అతిథిగృహానికి చేరుకున్న మంత్రికి టీటీడీ రిసెప్షన్ అధికారులు స్వాగతం పలికి బస, దర్శన ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

రూ.3.10 లక్షలు పలికిన వేమూరు లడ్డు

● దక్కించుకున్న ఎంపీటీసీ యోగనందరెడ్డి

తిరుచానూరు, సెప్టెంబరు 15: తిరుపతి రూరల్ మండలం వేమూరులో వినాయక చవితి ఉత్సవాల్లో 9వ రోజు ఆదివారం భారీగా వేలం పాటలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు పోటీపడగా బ్రాహ్మణపట్టు ఎంపీటీసీ బి.యోగానందరెడ్డి రికార్డు స్థాయిలో రూ.3.10లక్షలకు స్వామివారి లడ్డును దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ యోగానందరెడ్డి మాట్లాడుతూ స్వామివారి ప్రసాదం అందడం తమ అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు.



లడ్డును ఊరేగింపుగా తీసుకువస్తున్న ఎంపీటీసీ యోగానందరెడ్డి కుటుంబసభ్యులు

శ్రీవారిమెట్టు వద్ద భక్తుల కిటకిట

● టోకెన్లు లేక నిరాశతో వెనుదిరిగిన భక్తులు



టోకెన్ల కోసం క్యూలో నిలుచున్న భక్తులు

చంద్రగిరి, సెప్టెంబరు 15: శ్రీవారిమెట్టు వద్ద ఆదివారం భక్తులు కిటకిటలాడారు. వరుసగా మూడు రోజులు సెలవులు కావడంతో ఒక్కసారిగా శ్రీవారి దర్శనానికి భక్తులు భారీగా తరలి వచ్చారు. ఆదివారం శ్రీవారిమెట్టు మార్గంలో కాలినడకన తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లే భక్తులకు దర్శన టోకెన్లు మూడు వేలు మాత్రమే ఇచ్చారు. దీంతో వందలాది మంది భక్తులు టోకెన్లు లేక నిరాశతో వెనుదిరిగారు. ఇక్కడ ఒక్కో రోజు ఒక్కో విధంగా టోకెన్లు ఇస్తుండటంతో భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ నెల పెరటాసి నెల ప్రారంభం కానుండడంతో తమిళనాడు, కర్ణాటక, తదితరప్రాంతాల నుంచి కాలినడకన అధికసంఖ్యలో భక్తులు దర్శనానికి రానున్నారు. ఇకనైనా టీటీడీ స్పందించి భక్తుల కోసం ప్రతి రోజూ ఇచ్చే దర్శనం టోకెన్ల సంఖ్య పెంచాలని భక్తులు కోరుతున్నారు.

అబ్బురపరిచిన నృత్య ప్రదర్శన



తిరుచానూరు, సెప్టెంబరు 15: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన అబ్బురపరిచింది. చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి కళా తరంగిణి సంస్థ కళాబృందం నృత్య ప్రదర్శన చేశారు. కళాకారులు మధుశ్రీ, గగన్, చరిత, చిత్ర, జీవన్, లహరి, గగన, రమ్య, భానుశ్రీ, చరణ్‌సాయి తదితరులు పలు భక్తి గీతాలు వేదుకుందామ, భోలాశంకర శివ శంకర, జానపద గీతాలు అల్లిబిల్లి సోకులాడి చిట్టెమ్మ, గాజులు తెచ్చి మామయ్య, సినీ జానపదాలు ముత్యమల్లే మురిసి పోయే మల్లెమొగ్గ, రేలారే, రేలారే వంటి గీతాలకు నృత్యం చేశారు. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లి సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

వైభవంగా వినాయక నిమజ్జనం



భాకరాపేట, సెప్టెంబరు 15: చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేటలో వినాయక నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. బళ్లారి డ్రమ్ములతో యువత రంగులు చల్లుకుంటూ కేరింతలో నృత్యాలు చేస్తూ ఇంటింటా వినాయకుని పూజలు చేస్తూ ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకెళ్లారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



పద్మవల్లిపురంలో ఊరేగుతున్న వినాయకుడు

రామచంద్రాపురం: మండలంలోని గంగమాంబపురం, పద్మవల్లిపురం, రామాపురం గ్రామాల్లో ఆదివారం వినాయక నిమజ్జనం వైభవంగా జరిగింది. మేళతాళాల నడుమ గ్రామాల్లో ఊరేగించారు. అనంతరం యువకులు రంగులు చల్లుకుని కోలాహలంగా ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. గంగమాంబపురంలో జయశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. ఎస్‌ఐ రామాంజనేయులు బందోబస్తు చేపట్టారు. రాత్రి రాయల చెరువులో గణేష నిమజ్జనం జరిగింది.

ప్రకృతి వ్యవసాయంలో ఆధునిక విజ్ఞానం

● రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్

తిరుపతిరూరల్, సెప్టెంబరు 15 : ప్రకృతి వ్యవసాయంలో ఆధునిక విజ్ఞానం దాగి ఉందని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్ తెలిపారు. రైతు సాధికార సంస్థ అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను పరిశీలించేందుకు మెక్సికో ప్రతినిధుల బృందం ఆదివారం జిల్లాలో పర్యటించింది. తొలుత కరకంబాడి రోడ్డులోని ఓ హోటల్‌లో బృందంతో సమావేశం జరిగింది. ఏపీ ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ (ఏపీసీఎన్ఎఫ్), ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ అగ్రో ఎకాలజీ రీసెర్చ్ అండ్ లెర్నింగ్ సెంటర్ ద్వారా జరుగుతున్న కార్యక్రమాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఇందులో వివరించారు. మెక్సికో బృందంతోపాటు ప్రజా సంస్థల తరఫున పరిశోధకులు, సాంకేతిక నిపుణులు, రైతులు హాజరయ్యారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతు సంక్షేమమే కాకుండా ప్రజారోగ్యం, భూ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఏపీసీఎన్ఎఫ్‌తో కలిసి ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. అన్ని గ్రామాలకు ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాన్ని విస్తరించి రసాయన రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు సంకల్పించారన్నారు. మహిళా సంఘాల ద్వారా ప్రకృతి వ్యవసాయ విస్తరణ సులభతరమవుతోందన్నారు. మెక్సికో ప్రతినిధి బృంద ప్రతినిధులు మాట్లాడుతూ తమ దేశంలోని వాతావరణ పరిస్థితులను, వ్యవసాయ విధానాలను, పంటల వివరాలను తెలియజేశారు. నౌ పార్ట్‌నర్స్ ప్రతినిధులు మాట్లాడుతూ రైతుసాధికార సంస్థతో భాగస్వామ్యం కావడం సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. రైతుసాధికార సంస్థ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను వారు తిలకించారు. మెక్సికో ప్రభుత్వ ఏరియా డైరెక్టర్ డియాజ్‌మరియా, కమ్యూనికేషన్స్ డైరెక్టర్ రామిరేజ్ పార్డో ఎరికాసోమి, మెక్సికన్ నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ పరిశోధకులు లోపెజ్ మెర్లిన్ డేవిడ్, ఇసైయాస్ సోలాజానో మంజానో, ఫ్రాగోసో విల్లావిసెన్సియా పాబ్లో, నౌ పార్ట్‌నర్స్ ప్రతినిధులు, ఆర్‌వైఎస్ఎస్ సీనియర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. తర్వాత మెక్సికో బృందం తిరుపతి రూరల్ మండలం వేమూరులో అయ్యప్పనాయుడు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. బీజామృతం, ఘన, ద్రవ జీవామృతం, విత్తన గుళికల తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం సి.రామాపురంలో పర్యటించారు. అక్కడ మహిళా సంఘాలు, గ్రామ ఐక్యసంఘాల ప్రతినిధులతో మాట్లాడారు.



వేమూరులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న మెక్సికో బృంద ప్రతినిధులు, పక్కనే విజయ్‌కుమార్

లైటింగ్ కోసం వెయిటింగ్

● చంద్రగిరి కోటలో లైటింగ్ షో కట్
● పర్యాటకుల అసంతృప్తి



చంద్రగిరిలో లైటింగ్ షో (ఫైల్‌ఫొటో)

చంద్రగిరి, సెప్టెంబరు 15: చంద్రగిరి కోటలో లైటింగ్ షో కోసం పర్యాటకులు ఎదురు చూస్తున్నారు. 2000లో అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబు, పర్యాటకులను ఆకర్షించేందుకు కోట్లాది రూపాయలతో చంద్రగిరి కోటలో లైటింగ్ షోను ఏర్పాటు చేశారు. రాష్ట్ర విభజన తరువాత టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అప్పటి ప్రభుత్వం రూ.3.50 కోట్లతో చెన్నైకు చెందిన లక్స్ అండ్ డిజబుల్ సంస్థ ద్వారా లైటింగ్ షోను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించారు. 2018లో జూలైలో భారీ వర్షాలు పడటంతో కోటలో రాజగోపురంపై పిడుగు పడింది. దీంతో లైటింగ్ షో పాడైంది. అప్పటినుంచి ఇప్పటివరకు లైటింగ్ షో కనుమరుగైంది. పర్యాటకులు లైటింగ్ షో లేకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

బాగుచేసినా ప్రారంభం కాని షో..

ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికలకు ముందు లైటింగ్ షోకు సంబంధించిన పనులన బాగు చేశారు. ఈఏడాది జూన్ 4వ తేదీన పురావస్తుశాఖ, ఏపీ టూరిజం అధికారులు, లైటింగ్ షో నిర్వాహకులు లక్స్ అండ్ డిజబుల్ సంస్థ ఇంజనీర్లు చంద్రగిరి కోటను సందర్శించారు. లైటింగ్ షో ప్రదర్శనను తిలకించి అంతా ఓకే అని కితాబిచ్చారు. త్వరలోనే లైటింగ్ షోను పునఃప్రారంభి స్తామని అప్పట్లో అధికారులు తెలిపారు. ఇప్పుడు సెప్టెంబరు కూడా వచ్చేసింది. అయినా లైటింగ్ కోసం పర్యాటకులు వెయిట్ చేస్తూనే ఉన్నారు. అధికారులను అడిగితే కారణాలు చెప్పడం లేదు. ఇకనైనా స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి లైటింగ్ షోను పునఃప్రారంభించి, పూర్వ వైభవం తీసుకురావాలని పర్యాటకులు కోరుతున్నారు.

బంగారు తిరుచ్చిపై దర్శనమిచ్చిన కల్యాణ వెంకన్న



బంగారు తిరుచ్చిపై ఉభయదేవేరులతో దర్శనమిస్తున్న కల్యాణ వెంకన్న

చంద్రగిరి, సెప్టెంబరు 15: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. నిత్య సేవల్లో భాగంగా ఆలయంలో ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లను కల్యాణ మండపంలో వేంచేపు చేసి, ఆగమ శాస్త్రోక్తంగా ఉత్సవర్లకు కల్యాణోత్సవం నిర్వహిం చారు. శ్రవణ నక్షత్రం సందర్భంగా సాయంత్రం ఆలయ ఆవరణలో స్వామి అమ్మవార్ల ఉత్సవర్లకు ఊంజల్ సేవ కన్నులపండువగా జరిపించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లను విశేషంగా అలంకరించి, బంగారు తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. తర్వాత ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమాలలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజిరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారధి, జమేదర్ చిరంజీవి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నేతలకు పులివర్తి సుధారెడ్డి పరామర్శ

భాకరాపేట, సెప్టెంబరు 15: చిన్నగొట్టిగల్లు మండలం దీన్‌దార్లపల్లె పంచాయతీ తవ్వావాండ్లపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నేత కుమారస్వామిరెడ్డి అన్న సుబాస్కర రెడ్డి ఇటీవల గుండెపోటుతో మరణించారు. ఆదివారం జరిగిన శుభస్వీకరణ కార్య క్రమానికి పులివర్తి సుధారెడ్డి హాజరై సుబాస్కరెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళి, కార్యదర్శి మదనమోహన, తెలుగు మహిళా అధ్యక్షురాలు చిట్టెమ్మ, జిల్లా తెలుగు మహిళ కార్యదర్శి కొట్టే సుజాత, ఎంపీటీసీ విజయకుమారి, ఆర్వీ రమణారెడ్డి, మునస్వామినాయుడు, మల్లిఖార్జునరెడ్డి, మౌలాలి, వెంకటరత్నం, చెన్నయ్య, గురుమూర్తి, చంద్రశేఖరరెడ్డి, చలపతి, చంద్రశేఖర్, మున్నా సాహెబ్, రమేశ్‌రెడ్డి, ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





రికవరీ చేసిన ఫోన్లను చూపిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

చాట్‌బాట్‌తో 305 సెల్‌ఫోన్ల రికవరీ

చిత్తూరు, సెప్టెంబరు 15: ఇప్పటి వరకు ఏడు విడతల్లో 2030 ఫోన్లను జిల్లా పోలీసులు రికవరీ చేశారు. ఎనిమిదో విడతలో రూ.66లక్షల విలువ చేసే 305 సెల్‌ఫోన్లను రికవరీ చేశారు. ఈ వివరాలను ఆదివారం ఎస్పీ మణికంఠ చందోలు మీడియాకు తెలిపారు. జిల్లాలో కొంత కాలంగా వందలాది మంది మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్నారు. ఈ ఫోన్లను రికవరీ చేయడానికి చాట్‌బాట్ బృందం తగిన చర్యలు చేపట్టింది. నెలల వ్యవధిలో ఏపీతోపాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర నుంచి చోరీకి గురైన 66 లక్షల విలువ చేసే 305 ఫోన్లను రికవరీ చేశారు. ఈ ఫోన్లను ఆదివారం పోలీసు అతిథి గృహంలో బాధితులకు అందించారు.

చాట్‌బాట్‌లో నమోదు చేయడమిలా..

మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్న వారి ముందుగా 9440900004 నెంబరు వాట్సాప్‌కు హాయ్ లేదా హెల్ప్ అని పంపాలి. ఆ తర్వాత వెల్‌కమ్ టూ చిత్తూరు పోలీసు పేరున ఒక లింకు వస్తుంది. ఆ లింకులో గూగుల్ ఫార్మేట్ ఓపెన్ అవుతుంది. అందులో జిల్లా, పేరు, వయస్సు, తండ్రి, చిరునామా, కాంటాక్టింగ్ నెంబరు, మిస్ అయిన మొబైల్ మోడల్, ఐఎంఈఐ నెంబరు, మొబైల్ మిస్ అయిన ప్లేస్ వివరాలను నమోదు చేయాలి. ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఎస్పీ కోరారు.

డీసీసీబీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రఘుబాబు




రఘుబాబు - గంగిరెడ్డి

చిత్తూరుకలెక్టరేట్, సెప్టెంబరు 15: ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ చిత్తూరు యూనిట్ సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక డీసీసీబీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో జరిగింది. ముఖ్య అతిథులుగా ఏపీసీసీబీ చైర్మన్ సీహెచ్ మాధవరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీఎస్ రవికుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణరెడ్డి తదితరులు హాజరయ్యారు. ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆర్.రఘుబాబు, జిల్లా కార్యదర్శిగా వై. గంగిరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా టి. ధనుంజయరెడ్డి, కోశాధికారిగా ఎం.రమేష్, సభ్యులుగా సి.శ్రీదేవి, లక్ష్మీప్రసాద్ నాయుడు, ఎస్.నాగమణి, కె.రాజశేఖర్, ఎ.పవిత్ర, బి.గురునాథం, భువనేశ్వరి, ఎస్.జయశేఖర్, సి.నాగరాజ, కమిటీ గౌరవ సలహాదారుడుగా కె.వెంకటాచలపతి ఎన్నికయ్యారు.బ్యాంకు సీఈవో మనోహర్ గౌడ్, డీజీఎం, ఏజీఎంలు పాల్గొన్నారు.

చెంగాళమ్మ సేవలో చాగంటి దంపతులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 15: చెంగాళమ్మ పరమేశ్వరిని ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు దంపతులు ఆదివారం దర్శించుకొన్నారు. ఆలయ ఇన్‌చార్జి ఈవో శ్రీనివాసబాబు చాగంటి దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనంతరం వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మన్నారు పోలూరులోని అలఘు మల్లారి కృష్ణస్వామి ఆలయాన్ని చాగంటి దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్, మాజీ పాలక మండలి సభ్యులు ఐతా శ్రీధర్, ఎంఎం పద్మజ, కాకి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.




శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్, నగరి నియోజకవర్గ టీడీపీ నాయకుడు రెడ్డివారి చక్రపాణిరెడ్డి కుమారుడి నిశ్చితార్థానికి విచ్చేసిన మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చెంగారెడ్డి, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, బీజేపీ నాయకుడు భానుప్రకాష్‌రెడ్డి తదితరులు



యాగశాలలో పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

ఆగమోక్తంగా పవిత్రోత్సవాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 15: దక్షిణ కైలాసంగా పేరుగాంచిన ముక్కంటీశుడి ఆలయంలో మూడో రోజు ఆదివారం పవిత్రోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. యాగశాలలో ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో శ్రీ-కాళ-హస్తి ఉత్సవర్లు, భరద్వాజ మహర్షి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి విశేష అభిషేకాలు చేపట్టారు. పూర్ణాహారతులు సమర్పించారు. ఆలయ అధికారులు పూజా ద్రవ్యాలను సమర్పించారు. ఈవో ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, ప్రధాన అర్చకుడు స్వామినాథన్ గురుకుల్, వేదపండితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

23కిలోల గంజాయి స్వాధీనం

● రూ.50 వేల నగదు, కారు, సెల్‌ఫోన్లు స్వాధీనం
● ముగ్గురు నిందితుల అరెస్టు



మీడియాతో మాట్లాడుతున్న సీఐ తిమ్మయ్య

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 15: మండలంలోని ఆలత్తూరు క్రాస్ రోడ్డులో 23 కేజీల 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తిమ్మయ్య తెలిపారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ మండలంలోని ఆలత్తూరు క్రాస్ రోడ్డు దగ్గర ఎస్‌ఐ విశ్వనాథ నాయుడితో కలసి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా కారులో గంజాయిని తరలిస్తున్నారని సమాచారం వచ్చిందన్నారు. వెంటనే తహసీల్దార్ సుబ్రమణ్యంకు తాను సమచారం అందించానన్నారు. ఆయన ఆలత్తూరు క్రాస్‌కు చేరుకోగా వాహనాలను తనిఖీ చేశామన్నారు. ఈ తనిఖీలో శ్రీకాళహస్తి నుంచి వస్తున్న కారులో ముగ్గరు అనుమానాస్పదంగా కనిపించారన్నారు. వారిని కారు ఆపమనగా వారు పారిపోతుండగా వెంబడించి వారిని పట్టుకున్నామన్నారు. కారును తనిఖీ చేయగా 23 కిలోల గంజాయి ప్యాకెట్లు ఉన్నట్టు గుర్తించామన్నారు. కారులో ఉన్న ముగ్గరిని అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. అన్నమయ్య జిల్లా కలకడకు చెందిన మహబూబ్ బాషా, ఒడిశాకు చెందిన క్షత్రియ, దిలీప్‌గా గుర్తించారు. వీరు ఒడిశా నుంచి గంజాయి తీసుకొచ్చి తడ, తిరుపతి, శ్రీకాళహస్తిలలో విక్రయిస్తున్నట్టు చెప్పారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.20లక్షలు ఉంటుందని తెలిపారు. అలాగే రూ. 50వేల నగదు, మూడు సెల్ ఫోన్లు, కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ దాడుల్లో హెడ్ కానస్టేబుల్ నాగరాజు నాయుడు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మొగిలి ఘాట్ ప్రమాదంలో గాయపడ్డ మహిళ మృతి

● మృతురాలి స్వగ్రామం పాపిరెడ్డిపల్లెలో విషాద ఛాయలు



పద్మావతి (ఫైల్ ఫొటో)

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 15: మొగిలి ఘాట్‌లో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న పద్మావతి(49) ఆదివారం మృతి చెందింది. ఈమెను చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చేముందే ఆమె గుండె కొట్టుకోవడం ఆగిపోయింది. వైద్యులు శ్రమించి పీసీఆర్ చేసి బతికించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తమిళనాడులోని రాణిపేట సీఎంసీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈమెది గంగాధరనెల్లూరు మండలం పాపిరెడ్డిపల్లె గ్రామం. ఈ విషయం తెలియడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

హన్సికకు దహనక్రియలు పూర్తి

మహారాష్ట్రకు చెందిన అషతోష్, రిక్కీ వారి పిల్లలు హన్సిక(6), అష్మిత్ యాదవ్(3)లతో కలిసి బెంగళూరులో ఓ ప్రైవేటు ఫ్యాక్టరీలో పనులు చేసుకుని జీవిస్తున్నారు. శ్రీవారి దర్శనం కోసం వారు తిరుమలకు వచ్చి బెంగళూరుకు తిరుగు ప్రయాణమవుతుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో అషతోష్ కుమార్తె హన్సిక అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలినవారు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులకు మొదటగా చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. హన్సిక మృతదేహాన్ని కూడా వారితోపాటు స్విమ్స్ మార్చురీలో ఉంచారు. ఆదివారం అషతోష్ బంధువులు తిరుపతికి చేరుకోవడంతో వారి కుటుంబ సభ్యుల సమక్షంలో స్థానిక గోవిందధామంలో హన్సికకు దహనక్రియలు నిర్వహించారు. ఈ సమయంలో తల్లిదండ్రుల గుండెలు పగిలేలా రోదించడం అందరినీ కంటతడి పెట్టించింది.

నిలకడగానే కండక్టర్ ఆరోగ్యం

తీవ్రంగా గాయపడిన బస్సు కండక్టర్ చిరంజీవి(34) తమిళనాడులోని రాణిపేట సీఎంసీలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ముఖానికి ఒకసర్జరీ చేయాల్సి ఉందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు స్థల కేటాయింపునకు కృషి: ఆరణి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 15: ప్రపంచ దేశాల సరసన చేర్చేందుకు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కొనియాడారు. ఆదివారం మధ్యాహ్నం స్థానిక రామతులసి కల్యాణమండపంలో జరిగిన తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ వార్షిక సాధారణ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు ప్రభుత్వం తరపున స్థలం కేటాయించడానికి తన వంతు కృషి చేస్తానని ఆరణి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. కామన్ ఫెసిలిటీ సెంటర్స్ నిధులకు కేంద్రం భారీ మొత్తంలో రాయితీ ఇస్తుందని గుర్తు చేశారు. నగరంలో ఆతిధ్య రంగానికి మంచి అవకాశాలున్నాయని పేరెన్నిక కలిగిన పెద్ద హోటల్స్‌తో మరింత అభివృద్ధి చెందవలసిన అవసరం ఉందన్నారు. పరిశ్రమల అభివృద్ధికి సంబంధించి క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. అంతకుముందు రక్తదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి, సీపీఐ రామానాయుడు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మోహన్‌రాజు, కార్యదర్శి వాసుదేవన్, సభ్యులు మధు, రవి, కోదండరామయ్య, మంజునాథ్, చిన్నం పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా బీజేపీ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు కరపత్రాలను ఆవిష్కరించి, మొబైల్ యాప్‌ను చూపుతున్న బీజేపీ నాయకులు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 15: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ శ్రేణులు ఆదివారం నగరంలో ముమ్మరంగా నిర్వహించాయి. బీజేపీ కోస్తాంధ్ర జోనల్ ఇంచార్జి వల్లూరి జయప్రకాష్ నారాయణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత స్థానిక రాఘవేంద్రనగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కరపత్రాలను ఇతర నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జయప్రకాష్‌నారాయణ్ మాట్లాడుతూ... జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలను సభ్యత్వంలో భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయనను సీనియర్ నాయకులు నవీన్‌కుమార్‌రెడ్డి సన్మానించారు. తరువాత తిరుపతి 50వ డివిజన్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక ఇందిరా నగర్‌లో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ చంద్రప్ప, రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్, అధికార ప్రతినిధి పొనగంటి భాస్కర్, సీనియర్ నాయకులు నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

38 ఎర్రచందనం దుంగల స్వాధీనం

- ముగ్గురు స్మగ్లర్ల అరెస్టు


పట్టుబడ్డ స్మగ్లర్లతో టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, సెప్టెంబరు 15: మంగళం పరిధిలో ఆదివారం టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి 38 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐలు లింగాధర్, విశ్వనాథ్ బృందాలు, స్థానిక అటవీశాఖ అధికారులతో కలిసి మంగళం పరిధిలోని అటవీప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. ఓ సూపర్‌మార్కెట్ సమీపంలో కొందరు వ్యక్తులు టవేర వాహనంలో ఎర్రచందనం దుంగలు లోడ్ చస్తుండగా గమనించి చుట్టుముట్టారు. కొందరు తప్పించుకోగా ముగ్గురు పట్టుబడ్డారు. వారిలో ఇద్దరు తమిళనాడుకు చెందిన వారిగా గుర్తించారు. 38 ఎర్రచందనం దుంగలు, రెండు మోటారు సైకిళ్లు, టవేరా కారును స్వాధీనం చేసుకున్నారు. సీఐ సురేష్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టూరిజం వీడియో పోటీలు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 15: ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకొని వీడియో పోటీలు నిర్వహించనున్నట్లు టూరిజం రీజనల్ డైరెక్టర్ రమణమూర్తి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని పర్యాటక రంగ ప్రాముఖ్యత, ప్రజలకు అవగాహన, యాత్రికుల్లో ఉత్సాహం వంటి అంశాలపై వీడియోలు చిత్రీకరించి ఈనెల 24లోపు టూరిజం వెబ్‌సైట్‌కు పంపాలన్నారు. ఈనెల 27న వీడియో పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ప్రతిభావంతులు, నిపుణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9154989719, 6309942027 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

నాయీబ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించండి

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 15: టీటీడీ కల్యాణకట్ట, ఇతర విభాగాలు, అనుబంధ ఆలయాలలో విధులు నిర్వహిస్తున్న నాయీ బ్రాహ్మణ ఉద్యోగులు సమస్యలను పరిష్కరించాలని ఈవో శ్యామలరావుకు వినతి పత్రం అందించినట్లు ఏపీ నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు అధ్యక్షులు కె.మల్లికార్జున ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 11 సమస్యలతో కూడిన వినతిని ఆయన పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పి.మునిబాలకుమార్, ప్రధాన కార్యదర్శి బి.మల్లికార్జున, కోశాధికారి ఎ.కామరాజు, ఉపాధ్యక్షులు ఆర్.సత్యనారాయణ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బై..బై..గణేశా...

- ఘనంగా వినాయక నిమజ్జనోత్సవం




తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 15: గణనాథుడి నినాదాలతో వినాయకసాగర్ ప్రాంగణం మారుమోగింది. వినాయక చవితి వేడుకల్లో 9వ రోజు కావడంతో ఆదివారం నిమజ్జనాలు హోరెత్తాయి.. దాదాపు 36 విగ్రహాలు నిమజ్జనానికి తరలివచ్చాయి. జై బోలో గణేష్ మహరాజ్‌కు జై అంటూ యువత పెద్దఎత్తున నినాదాలు చేస్తూ నిమజ్జన కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. కరకంబాడీ రోడ్డులో నిమజ్జనానికి తరలివస్తున్న యువత సందడి చేశారు.



విగ్రహాలకు స్థానిక సాగర్‌వద్ద నిమజ్జన కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. అలిపిరి సీఐ రామ్‌కిషోర్, నిమజ్జన కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు ఆర్‌సీ మునికృష్ణ, మాంగాటి గోపాల్‌రెడ్డి, గుండాల గోపీనాథ్‌రెడ్డి, ఆకుల సతీష్, ఆనంద్, సుబ్రహ్మణ్యంరెడ్డి ఇతర సభ్యులు, మున్సిపల్ అధికారులు దగ్గరుండి ఏ ర్పాట్లను పర్యవేక్షించారు. **తిరుపతి(నేరవిభాగం):** జిల్లా ఎస్పీ కార్యాలయంలో వినాయక విగ్రహ నిమజ్జనం సందర్భంగా జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ ముఖ్య భద్రతాధికారి శ్రీధర్, అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచ్చారి, శ్రీనివాసరావులు పూజల్లో పాల్గొన్నారు.

మోక్షగుండం సేవలు స్ఫూర్తిదాయకం




సమావేశంలో మాట్లాడుతున్న కోట పురుషోత్తం, వేదికపై ప్రముఖులు - విశ్వేశ్వరయ్యకు నివాళులర్పిస్తున్న సదరన్ డిస్కం ఇంజనీర్లు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 15: అసోసియేషన్ ఆఫ్ ప్లానర్స్ అండ్ ఇంజినీర్స్ (టేప్) ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా ఇంజినీర్స్‌డే వేడుకలు జరిగాయి. టేప్ అధ్యక్షుడు మట్లి ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన స్థానిక బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో జరిగిన కార్యక్రమానికి తుడా ముఖ్య ప్రణాళిక అధికారి దేవి కుమారి, ప్రముఖ రచయిత కోట పురుషోత్తం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశానికి విశ్వేశ్వరయ్య అందించిన సేవలను కొనియాడారు. అనంతరం టేప్ వ్యవస్థాపక అధ్యక్షుడు, సీనియర్ ఇంజినీర్ వెంకటరమణ దంపతులను సన్మానించారు. ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విశేష ప్రతిభ కనబరిచిన వారికి నగదు బహుమతులను అందజేశారు. ఇంజినీర్స్ డే సందర్భంగా వాసన్ ఐ కేర్ సౌజన్యంతో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. టేప్ ఛైర్మన్ టి. వెంకటేశ్ బాబు, ఉపాధ్యక్షుడు పి. నాగేశ్వరరావు, కార్యదర్శి బుసా షణ్ముగం, కోశాధికారి సుధాకర్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి రఘురాంరడ్డి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు సురేష్, శ్రీనివాసులు, బాలకృష్ణ, వసంతరావు, నరేష్, సందీప్, బంగారయ్య, శంకర్, శ్రీనివాసమూర్తి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. **తిరుపతి (ఆటోనగర్):** తిరుపతి సదరన్ డిస్కం కార్యాలయంలో ఆదివారం విశ్వేశ్వరయ్య జయంతిలో డిస్కం సీఎండి కె.సంతోషరావు పాల్గొని నివాళులర్పించారు. సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.అయూబ్‌ఖాన్, సీజీఎం జె.రమణాదేవి, జీఎంలు మురళి,రామచంద్రరావు, భాస్కర్ రెడ్డి, వెంకటరాజు,చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. **తిరుపతిరూరల్:** తిరుపతి రూరల్ మండలం సి.గొల్లపల్లెలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పలువురు అధ్యాపకులు పుష్పాంజలితో నివాళి అర్పించారు. కళాశాల సెక్రటరీ వై.ఆనందరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **తిరుపతి(విద్య):** విశ్వేశ్వరయ్య విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, చిగోరా ఆధ్యాత్మిక కేంద్రం వ్యవస్థాపకులు హనుమంతరావు, కొట్టేటి సుబ్రహ్మణ్యంరెడ్డి, లక్ష్మి పాల్గొన్నారు.

గోవిందరాజ స్వామికి పవిత్రాల సమర్పణ



తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 15: తిరుపతి గోవిందరాజస్వామి ఆలయ పవిత్రోత్సవాలలో భాగంగా ఆదివారం అర్చకస్వాములు పవిత్రాలను శాస్త్రోక్తంగా సమర్పించారు. ఉదయం స్వామివారికి సుప్రభాతం, తోమాలసేవ, సహస్రనామార్చన జరిగాయి. ఆ తరువాత గోవిందరాజస్వామి ఆలయంలోని వివిధ దేవతామూర్తులకు అర్చకులు పవిత్రాలను వేదమంత్రాల మధ్య సమర్పించారు. ఉత్సవాలు సోమవారం ముగుస్తాయి. కార్యక్రమంలో ఆలయ డిప్యూటి ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, ఇతర అధికారులు, తిరుమల పెద్ద జీయర్ స్వాములు, అర్చకులు పాల్గొన్నారు.

తుమ్మలగుంటలో...

తిరుపతిరూరల్,సెప్టెంబరు15: తుమ్మలగుంటలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శాస్త్రోక్తంగాపవిత్ర సమర్పణ నిర్వహించారు. ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజన సేవను వేడుకగా నిర్వహించారు. సాయంత్రం సీతారామలక్ష్మణులు బంగారు తిరుచ్చిపై ఆలయ మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సోదరుడు రఘునాథరెడ్డి, మంజుల దంపతులు, ఈవో సుబ్రమణ్యంరెడ్డి, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

అలరించిన నృత్యోత్సవం



తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 15: స్థానిక వేంకటేశ్వర సంగీత, నృత్యకళాశాల వేదికగా ఆదివారం సాయి నటరాజ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన దక్షిణ భారత సంగీత నృత్యోత్సవాలు ఆహూతులను అలరించాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు వేడుకలు జరిగాయి. ఇందులో తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 120 మంది కళాకారులు భరతనాట్యం, కూచిపూడి, శాస్త్రీయ సంగీతం, జానపద సంగీత పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమ ముద్దుబాల ముఖ్యఅతిథిగా హాజరై విజేతలను అభినందించారు. గురుశ్రేష్ఠ, ప్రతిభా పురస్కారాలను అందజేశారు. నాట్యగురువులు కె. దేవేంద్రపిళ్లై, ఉషారాణి, విద్యావేత్త విశ్వచందన్ రెడ్డి, అకాడమీ డైరెక్టర్ శరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాజాగౌతంకు ఉత్తమ ఇంజనీర్ అవార్డు



తిరుపతి(విద్య), సెప్టెంబరు 15: బుద్ధా ప్రాజెక్ట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఛీఫ్ కన్సల్టెంట్ ఇంజనీరు రాజా గౌతమ్‌కు ఉత్తమ ఇంజనీర్-2024 అవార్డు లభించింది. డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక పద్మావతి మహిళా వర్శిటీలో ఇంజనీర్స్ డే కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా... ఆధునిక నిర్మాణ రంగంలో సాంకేతిక సూచనలు అన్న అంశంపై రాజా గౌతమ్ అవార్డుకు ఎంపికయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ట్రిపుల్ ఐటీ సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ డాక్టర్. ఎ.మురళీకృష్ణ ఆయనను ఘనంగా సన్మానించి అవార్డును అందజేశారు. అవార్డు గ్రహీత రాజా గౌతమ్ మాట్లాడుతూ... ఉత్తమ ఇంజనీర్-2024 అవార్డును అందుకోవడం బాధ్యతను మరింత పెంచిందన్నారు. నిర్మాణరంగం సుస్థిర అభివృద్ధి సాధించాల్సి ఉందన్నారు. నాణ్యత విషయంలో ఇంజనీర్లు శ్రద్ధ చూపాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో డిప్లొమా విద్యార్థి దుర్మరణం


వెంకటేష్(పాతచిత్రం)

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 15: రోడ్డు ప్రమాదంలో డిప్లొమా విద్యార్థి దుర్మరణం చెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలం జగ్గరాజుపల్లి వద్ద వెంకటగిరి - ఏర్పేడు రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగింది. శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవినాయక్ తెలిపిన వివరాలు... శ్రీకాళహస్తి మండలం ఎల్లంపల్లికి చెందిన కృష్ణయ్య, ధనమ్మ దంపతులు రైతులు. వీరికి ఇద్దరు కుమార్తెలతో పాటు వెంకటేష్(19) కుమారుడు ఉన్నారు. అనంతపురం జేఎన్‌టీయూలో డిప్లొమా కోర్సు చేస్తున్న వెంకటేష్ వరుస సెలవులు కావడంతో శనివారం స్వగ్రామానికి వచ్చాడు. పెద్దనాన్న కుమారుడు జయకుమార్ బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం కోసం నైపుణ్య శిక్షణ పొందుతున్నాడు. ఈ ఇద్దరు అన్నదమ్ములు ఆదివారం సొంతపనుల నిమిత్తం వెంకటగిరికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో శ్రీకాళహస్తి మండలం జగ్గరాజుపల్లి నుంచి ఓ ట్రాక్టర్ వెంకటగిరి - ఏర్పేడు రహదారిపైకి ప్రవేశించే సమయంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందగా జయకుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. ట్రాక్టర్ డ్రైవర్ పరారయ్యాడు. స్థానికులు గాయపడిన జయకుమార్‌ను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో రుయాకు తరలించారు. సీఐ రవినాయక్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చూరీకి తరలించారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో కడతేరిపోవడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు.

అనుమానాస్పద స్థితిలో ఆటోనగర్ వాసి మృతి


నాగరాజు మృతదేహం

విజయపురం, సెప్టెంబరు 15: అనుమానాస్పద స్థితిలో నాగరాజు(37) మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి మండలంలోని జంబాడ ఆదిఆంధ్రవాడలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నాగరాజుకు 2012లో వివాహమై తిరుపతి ఆటోనగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. ఇతను జంబాడ బస్టాండు సమీపంలో రోడ్డు పక్కన చెట్ల మధ్యలో మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆదివారం పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించి శవ పరీక్షల నిమిత్తం పోస్టుమార్టంకు పంపారు. మృతుడికి తన అన్న భార్యతో సంబంధం ఉండడంతో స్వగ్రామానికి వెళ్లేవాడని, మృతిపై అనుమానంగా ఉందని భార్య ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ గోవిందరాజులు తెలిపారు.

విశేషంగా కొనసాగుతున్న ధరణి అన్నప్రసాద వితరణ


అన్నదానం చేస్తున్న రవికుమార్, వలంటీర్లు

తిరుపతి(గాంధీరోడ్డు),సెప్టెంబరు15: తిరుపతికి చెందిన ధరణి నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఆదివారం 502వ రోజుకు చేరింది. ఎంఆర్‌పల్లె లోని ధరణి అబాకస్ సంస్థ డైరెక్టర్ ఎం.రవి కుమార్ ఆధ్వర్యంలో 2023 మే1న స్థానిక రుయా,స్విమ్స్, మెటర్నిటీ ఆసుపత్రిల పేదప్రజలు, రోగుల సహాయకులకు రోజూ మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈక్రమంలో రోజూ దాదాపు 150మందికి అన్నదానం చేస్తున్నారు. 19 సంవత్సరాలపాటు అన్నదానం చేశారు. గురువారం రేణిగుంట, తిరుపతిలోని సాయి బాబ మందిరాల వద్ద అన్న ప్రసాద వితరణ చేసేవారు. 2023నుంచి రుయా, మెటర్నిటీ, స్విమ్స్ ఆసుపత్రిల సమీపంలో అన్నదాన వితరణకు శ్రీకారం చుట్టి ఇప్పటివరకూ ధరణి నిత్య అన్నప్రసాదం పేరిట కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.

చిన్నారుల కిట్లకూ మంగళం

- ఆర్నెల్లకే చేతులెత్తేసిన గత వైసీపీ ప్రభుత్వం
- ఐదేళ్లూ తల్లులకు తప్పని ఆర్థిక భారం
- కిట్లను పునరుద్ధరించాలని కోరుతున్న బాలింతలు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 15: పురిటి బిడ్డల సంక్షేమాన్నీ గత వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. అధికారంలోకి వచ్చిన నెలల్లోనే బేబీ కిట్లక మంగళం పాడేసింది. బాలింతలపై భారం పెంచింది. 2016లో నాటి టీడీపీ ప్రభుత్వం పురిటి బిడ్డల కోసం ఎన్‌టీఆర్ బేబీ కిట్లను ఉచితంగా అందించే కార్యక్రమం ప్రారంభించిది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 102 పీహెచ్‌సీలు, 16 సీహెచ్‌సీలు, నాలుగు ఏరియా ఆస్పత్రుల్లో నెలకు సుమారు నాలుగు వేలకు పైగా ప్రసవాలు జరుగుతాయి. తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలోనే నెలకు 2 వేలకు పైగా ప్రసవాలు జరుగుతాయి. ఈ ఆస్పత్రుల్లో పుట్టిన ప్రతీ చిన్నారులకు అప్పట్లో రూ.1,500 విలువ చేసే ఎన్‌టీఆర్ బేబీ కిట్లను ఉచితంగా ఇచ్చేవారు. కిట్‌లో బేబీ టవల్-1, బేబీ బెడ్ -1, లిక్విడ్ సోప్ -1, దోమ తెర -1 ఉండేవి. పిల్లలకు ఉపయోగకరంగా ఉండటంతో తల్లులకు ఆర్థిక భారం తగ్గేది.

పేరు మార్చి... ఆపై పథకం ఆపేసి

వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే డాక్టర్ వైఎస్సార్ బేబీ కిట్‌గా పేరు మార్చింది. పేరు మార్చినా కిట్లను ఇవ్వలేకపోయింది. గతంలో కొనుగోలు చేసి ఆస్పత్రుల్లో ఉన్న బేబీ కిట్లకు పైన బ్యాగును మార్చి ఆరు నెలలు అందజేసింది. అవి అయిపోవడంతో కొత్తగా కొనుగోలు చేయకుండాపథకానికి స్వస్తి పలికింది. దీంతో గడిచిన ఐదేళ్లలో నిరుపేద తల్లులకు ఈ కిట్లు అందక ఇబ్బందులు తప్పలేదు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రులకు ప్రసవాలకు వచ్చే నిరుపేదలను దృష్టిలో పెట్టుకొని బేబీ కిట్ల పథకాన్ని పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.



ఎన్‌టీఆర్ బేబీ కిట్లు


బయటి నుంచి కొనుగోలు చేసిన బెడ్డులో బిడ్డను ఆస్పత్రి నుంచి తీసుకువెళుతున్న తల్లి



ఎంతగానో ఉపయోగపడేవి

- డాక్టర్ శ్రీహరి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

గతంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో పుట్టిన చిన్నారులకు బేబీ కిట్లు ఎంతగానో ఉపయోగపడేవి. పురిటి బిడ్డలను బయటకు తీసుకువెళ్ళే సమయంలో రక్షణగా ఉండేవి. ప్రస్తుతం సరఫరా నిలిచిపోయింది. ప్రభుత్వ ఆస్పత్రులకు కాన్పులకు వచ్చే వారికి ఇవి ఇవ్వడం లేదు. వీటిని ఇవ్వాలని చాలా మంది తల్లులు అడుగుతున్నారు.

ఉప్పరపల్లెలో అన్నదానం

తిరుపతి రూరల్, సెప్టెంబరు15: తుమ్మలగుంట పంచాయతీలోని ఉప్పరపల్లె నడివీధిలో వినాయక నిమజ్జనం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం భక్తులు, స్థానికులకు అన్నదానం నిర్వహించారు. గ్రామానికి చెందిన టీడీపీ నేత దొడ్ల కరుణాకర్‌రెడ్డి హాజరై అన్నదానం చేశారు. నవీన్‌రాయల్, వంశీ, సురేష్, హరి, చంద్ర, మునిరత్నం, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. సి.గొల్లపల్లెలోని వినాయక కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

శ్రీవారి హుండీ ఆదాయం

తిరుమల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.19 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించింది.

సురేష్‌కు సన్మానం


సురేష్‌ను సన్మానిస్తున్న ఎస్సీవీనాయుడు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 15: మండలంలోని ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు కూనాటి సురేష్‌కు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరంచిన నేపథ్యంలో ఆదివారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు తన నివాసంలో ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సీవీనాయుడు మాట్లాడుతూ సమాజంలో తల్లిదండ్రుల తరువాత అంతటి ఉన్నతమైన స్థానం గురువులదేనని తెలిపారు. ఎస్సీవీ కిరణ్‌నాయుడు, జి.భాస్కరయ్యనాయుడు, రవినాయుడు, సుదర్శన్‌నాయుడు, పి.సుబ్రహ్మణ్యం, డిల్లీ ప్రతాప్, కిషోర్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. సురేష్‌ను పలువురు రచయితలు ఘనంగా సన్మానించారు.

26నుంచి గంధోత్సవం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 15: పట్టణంలోని స్వర్ణముఖి నది సమీపంలో ఉన్న హజరత్ ఖవాజా సయ్యద్‌షా జుంలేషా పీర్ చిస్తీయిన్ ఖాదరీవలి దర్గా గంధోత్సవాలు ఈనెల 26నుంచి 29 వరకు జరుగుతాయని ఉరుసు కమిటీ నిర్వాహకులు చెప్పారు. ఆదివారం ఉరుసు నిర్వహణపై వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దర్గా నిర్వాహకుడు జహంగీర్‌బాషా మాట్లాడుతూ... నాలుగు సంవత్సరాలుగా అనివార్య కారణాల వల్ల గంధోత్సవాలు జరగలేదన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో గంధోత్సవం జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు. బాబా ఫరీద్, ఉరుసు కమిటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, సయ్యద్ అహ్మద్, జమ్రుద్దీన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 15: మండలంలో బాల్య వివాహాన్ని ఎస్ఐ విశ్వనాథ నాయుడు శనివారం రాత్రి అడ్డుకున్నారు. మండలానికి చెందిన యువకుడికి, బాలికకు ఆలయంలో వివాహం జరుగుతున్నట్టు సమాచారం మేరకు ఎస్ఐ సిబ్బందితో వెళ్లి అడ్డుకున్నారు. బాలికను శ్రీకాళహస్తి శిశు సంక్షేమ శాఖ అధికారులకు అప్పగించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 15: పట్టణంలోని భాస్కరపేట పుర పాలక సంఘ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 1996-97 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు తాము విద్య నేర్చుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. తమకు విద్యనేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. తమ బాల్య జ్ఞాపకలను నెమరువేసుకుని సంతోషంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యం, సుగుణ, వీరరాఘవులు, రమణయ్య, నాగేశ్వరరావు, బాలకృష్ణయ్య పాల్గొనగా పూర్వవిద్యార్థులు మధు, చంద్రశేఖర్, సుబ్బరాయులు, సుకుమార్, బాలాజీ, చిన్న తదితరులు ఏర్పాట్లను చేపట్టారు.

సీఆర్ఎస్‌లో ఇంజనీర్స్ డే

రేణిగుంట, సెప్టెంబరు 15: స్థానిక సీఆర్ఎస్‌లో ఇంజనీర్స్‌డే ఘనంగా నిర్వహించారు. సమావేశ మందిరంలో ఏఐఆర్పీఎఫ్, సీఆర్ఎస్ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకకు ముఖ్యఅతిథిగా సీడబ్ల్యూ దేవసహాయం, సీనియర్ డీఎంవో హిమజాబాయి పాల్గొని పదవీవిరమణ పొందిన ఐదుగురు ఇంజనీర్లను సన్మానించారు. సురేందర్‌రెడ్డి, విజయకుమార్, కృష్ణదాస్ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి రూ.10 లక్షల సాయం

- డిప్యూటీ సీఎం చొరవతో సీఎం రిలీఫ్ ఫండ్

పిచ్చాటూరు, సెప్టెంబరు 15: రోడ్డు ప్రమాదంలో గాయపడి కోమాలో వెళ్లిపోయిన కానిస్టేబుల్ వైద్య ఖర్చుల కోసం ప్రభుత్వం రూ.10 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయనుంది. మూడునెలల క్రితం కేవీబీపురం పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ప్రభాకర్ సొంతూరైన పిచ్చాటూరు మండలం తులసికృష్ణాపురానికి వస్తుండగా స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటినుంచి కోమాలో ఉన్నాడు. ప్రస్తుతం వేలూరు సీఎంసీలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో తిరుపతి పర్యటనలో భాగంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రేణిగుంట విమానాశ్రయానికి వచ్చారు. ఆ సమయంలో కానిస్టేబుల్ భార్య కీర్తిక ఆయన్ను కలిసి సాయం కోరింది. స్పందించిన పవన్ ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తరువాత ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరుకు ఏర్పాట్లు చేశారు. ఆ మేరకు వెంటనే చికిత్సలు ప్రారంభించడం కోసం ఆస్పత్రికి వైద్య ఖర్చుల కోసం రూ.10 లక్షల అప్పు పత్రాన్ని అందించారు. ఆపత్కాలంలో ఆదుకున్న పవన్‌కల్యాణ్‌కు, సకాలంలో ప్రతిపాదం సిద్ధం చేసిన అధికారులకు కీర్తిక కృతజ్ఞతలు తెలిపారు.

పుత్తూరు వార్తలు

ఉదయం నడకతో ఆరోగ్యం

పుత్తూరు, సెప్టెంబరు 15: ప్రతిరోజు ఉదయాన్నే నడిస్తే ఆరోగ్యంగా ఉంటామని చిన్నపిల్లల వైద్యనిపుణుడు ఆర్ముగం తెలిపారు. ఇక పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ... అసోసియేషన్ భవనం ముందున్న ఖాళీ స్థలాన్ని కొనుగోలు చేసేందుకు సభ్యులు సహకరించాలని కోరారు. అసోసియేషన్ సభ్యుడు డాక్టర్ రవిరాజు ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్‌కు ఎలెక్ట్ ప్రెసిడెంట్ అయిన సందర్భంగా సభ్యులు ఘనంగా సన్మానించారు. అధ్యక్షుడు కెఎల్ఎన్ మూర్తి, ఎలెక్ట్ గవర్నర్ మాధవనాయుడు పాల్గొన్నారు.

మాజీ మంత్రి రోజాకు సన్మానం

పుత్తూరు, సెప్టెంబరు 15: వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు స్వీకరించిన మాజీ మంత్రి రోజాను బలిజ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపిరాయల్ సన్మానించారు. నగరి మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ జీర్ణోద్ధరణ పూజల్లో ఎమ్మెల్యే భానుప్రకాష్


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

పుత్తూరు టౌన్, సెప్టెంబరు 15: పట్టణంలోని కామాక్షి సమేత సదాశివేశ్వరాలయం ప్రాంగణంలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయ జీరోణద్ధరణ, అష్టబంధన, మహా కుంభాభిషేకం అత్యంత వేడుకగా సాగాయి. ఆదివారం జరిగిన ఈ వేడుకల్లో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. ముందుగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని అమరం కండ్రిగలో వినాయక పూజలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

కనుమరుగైన ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 15: వందలాదిమంది దంపతుల మధ్య కుటుంబ కలహాలను సామరస్యంగా పరిష్కరించిన ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ కనుమరుగైంది. భార్య, భర్తల మధ్య అగాధాలను పరిష్కరించి మేలు చేసే ప్రక్రియ జనానికి దూరమైంది. శ్రీకాళహస్తి పట్టణంలోని 1టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విశిష్ట సేవలందించిన ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ నేడు దాదాపుగా కనుమరుగైంది.

శ్రీకాళహస్తి సబ్‌డివిజన్ పరిధిలో మహిళల సమస్యలు, కుటుంబ కలహాలు పరిష్కరించేందుకు గతంలో ఎలాంటి వేదిక అందుబాటులో లేదు. ఇలాంటి సమస్యలు ఎదురైతే వ్యయప్రయాసలకోర్చి తిరుపతి మహిళా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాల్సి వచ్చేది. ఈ క్రమంలో కలహాలు ముదిరి ఎందరో దంపతుల మధ్య వీడనిచిచ్చుతో జీవితాలు గందరగోళంగా మారిపోయేవి. ఈ సమస్యపై 2014లో టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. శ్రీకాళహస్తి సబ్‌డివిజన్ పరిధిలో కుటుంబ సమస్యలు పరిష్కరించేందుకు పట్టణ కేంద్రంలోని 1టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌ను 2016లో ప్రత్యేకంగా ప్రారంభించింది. అప్పటి తిరుపతి ఎస్పీ జయలక్ష్మి చేతుల మీదుగా ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. మహిళా ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్‌తో పాటు ఐదుగురు మహిళా కానిస్టేబుళ్లను, సైకాలజిస్టు కౌన్సిలర్‌ను నియమించారు. సబ్‌డివిజన్ పరిధిలో కుటుంబ కలహాలు, పోలీసు కేసులు, కోర్టుల దాకా వెళ్లకుండా ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌లో రాజీ చేసేవారు. అలా వందలమంది దంపతులను వీడిపోకుండా ఈ కేంద్రం ద్వారా మళ్లీ ఒక్కటి చేశారు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ నిర్వహణ అటకెక్కింది. సదరు సెంటర్‌ను పోలీసు క్యాంటీన్ కోసం కేటాయించారు. దీంతో శ్రీకాళహస్తి సబ్‌డివిజన్ పరిధిలో ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ కనుమరుగైంది. అప్పటి నుంచి కుటుంబ సమస్యల పరిష్కారానికి వేదిక కరువైంది. ఇకనైనా కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌ను తిరిగి ఏర్పాటును చేయాల్సి ఉంది.


ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ భవనం

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 15: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సహా వరుస సెలవులు కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 30 వేలమంది దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,470మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,904మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,473 మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,187, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 376 మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 308మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 70మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 16,454 విక్రయించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



వాయులింగేశ్వరుడి సేవలో కలెక్టర్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 15: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని ఆదివారం కలెక్టర్ వెంకటేశ్వర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈవో ఎస్వీఎస్ఎన్ మూర్తి వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ దంపతులు ప్రత్యేక రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద ఆలయ వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.


యాగశాలలో పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

ఆగమోక్తంగా పవిత్రోత్సవాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 15: దక్షిణ కైలాసంగా పేరుగాంచిన ముక్కంటీశుడి ఆలయంలో మూడో రోజు ఆదివారం పవిత్రోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. యాగశాలలో ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో శ్రీ-కాళ-హస్తి ఉత్సవర్లు, భరద్వాజ మహర్షి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి విశేష అభిషేకాలు చేపట్టారు. పూర్ణాహారతులు సమర్పించారు. ఆలయ అధికారులు పూజా ద్రవ్యాలను సమర్పించారు. ఈవో ఎస్వీఎస్ఎన్ మూర్తి, ప్రధాన అర్చకుడు స్వామినాథన్ గురుకుల్, వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా గణేశ నిమజ్జనం


పుత్తేరి, గుడిమల్లంలలో నిమజ్జనానికి తరలుతున్న వినాయక ప్రతిమలు - లడ్డూతో మునిరాజా, గీత దంపతులు

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 15: మండలంలో చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలను ఆదివారం నిమజ్జనం చేశారు. రెడ్డిగుంట బాడవ, పుత్తేరి, పీవీకండ్రిగ, బీఎస్‌పురం, కుమార వెంకటాపురం గ్రామాల్లో గణేశుడి ప్రతిమలను ఊరేగించిన అనంతరం సమీపంలో కుంటలు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా యువత ఆధ్వర్యంలో ఉట్టి ఉత్సవాల్ని నిర్వహించారు.

ఏర్పేడు: చవితి వేడుకల్లో భాగంగా 9వ రోజు ఆదివారం గణనాథుల నిమజ్జనాలను నిర్వహించారు. గుడిమల్లంలో యువత ఏర్పాటు చేసిన వినాయకస్వామి ప్రతిమను ఆదివారం సాయంత్రం నిమజ్జనం చేశారు. ఈ వేడుకల్లో గుడిమల్లం ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఏర్పేడులో సర్పంచ్ శివయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. రాజులకండ్రిగలో చవితి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమ నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన వేలంలో స్వామిని నివేదించిన లడ్డూను మునిరాజు, గీత దంపతులు రూ.55వేలకు, వినాయకుడి బొడ్డులో ఉంచిన రూపాయి బిళ్లను ఎం.శంకర్‌నాయుడు, పుష్ప దంపతులు రూ.30వేలకు దక్కించుకున్నారు. సర్పంచ్ చెంగ్రాజు మల్లికార్జునాయుడు, మునిభాస్కర్, సరస్వతి పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: మండలంలో వినాయక నిమజ్జనాలు ఆదివారం జరిగాయి. వరదయ్యపాళెం, గోవర్ధనపురం, లక్ష్మీపురం తదితర గ్రామాల్లోని వినాయకస్వామి ప్రతిమలకు పూజలు నిర్వహించి అనంతరం ఊరేగించి నిమజ్జనం చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో డిప్లొమా విద్యార్థి దుర్మరణం

- మరో యువకుడికి తీవ్రగాయాలు


వెంకటేష్ (ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 15: రోడ్డు ప్రమాదంలో డిప్లొమా విద్యార్థి దుర్మరణం చెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలం జగ్గరాజుపల్లి వద్ద వెంకటగిరి - ఏర్పేడు రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగింది. శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవినాయక్ తెలిపిన వివరాలు... శ్రీకాళహస్తి మండలం ఎల్లంపల్లికి చెందిన కృష్ణయ్య, ధనమ్మ దంపతులు రైతులు. వీరికి ఇద్దరు కుమార్తెలతో పాటు వెంకటేష్(19) కుమారుడు ఉన్నారు. అనంతపురం జేఎన్‌టీయూలో డిప్లొమా కోర్సు చేస్తున్న వెంకటేశ్ వరుస సెలవులు కావడంతో శనివారం స్వగ్రామానికి వచ్చాడు. పెద్దనాన్న కుమారుడు జయకుమార్ బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం కోసం నైపుణ్య శిక్షణ పొందుతున్నాడు. ఈ ఇద్దరు అన్నదమ్ములు ఆదివారం సొంతపనుల నిమిత్తం వెంకటగిరికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో శ్రీకాళహస్తి మండలం జగ్గరాజుపల్లి నుంచి ఓ ట్రాక్టర్ వెంకటగిరి - ఏర్పేడు రహదారిపైకి ప్రవేశించే సమయంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందగా జయకుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. ట్రాక్టర్ డ్రైవర్ పరారయ్యాడు. స్థానికులు గాయపడిన జయకుమార్‌ను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో రుయాకు తరలించారు. సీఐ రవినాయక్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో కడతేరిపోవడంతో తల్లిదండ్రులు భోరున విలపించారు.

సావిత్రికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 15: పట్టణానికి చెందిన సావిత్రి ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డును అందుకున్నారు. తిరుపతి విశ్వం విద్యాసంస్థల ప్రాంగణంలో ఆదివారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి సర్వేపల్లి రాధాకృష్ణన్ మనవడు జి.సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన చేతుల మీదుగా ఉపాధ్యాయురాలు సావిత్రి అవార్డు అందుకున్నారు.

బీజేపీ బలోపేతమే లక్ష్యం

వరదయ్యపాళెం, సెప్టెంబరు 15: మండలంలో బీజేపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా పరిశీలకుడు, కోస్తాంధ్ర జోనల్ ప్రముఖ్ వి.జయప్రకాష్‌నారాయణ సూచించారు. తిరుపతిలో ఆదివారం గుత్తి త్యాగరాజు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. సభ్యత్వ నమోదుకు కృషి చేయాలని జయప్రకాష్‌నారాయణ్ సూచించారు.

గంజాయి స్వాధీనం: నిందితుల అరెస్టు


నిందితులను చూపుతున్న పోలీసులు

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 15: మండలంలోని ఆలత్తూరు క్రాస్ రోడ్డులో 23 కేజీల 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తిమ్మయ్య తెలిపారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ మండలంలోని ఆలత్తూరు క్రాస్ రోడ్డు దగ్గర ఎస్ఐ విశ్వనాథ నాయుడితో కలసి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా కారులో గంజాయిని తరలిస్తున్నారని సమాచారం వచ్చిందన్నారు. వెంటనే తహసీల్దార్ సుబ్రమణ్యంకు తాను సమచారం అందించానన్నారు. ఆయన ఆలత్తూరు క్రాస్‌కు చేరుకోగా వాహనాలను తనిఖీ చేశామన్నారు. ఈ తనిఖీలో శ్రీకాళహస్తి నుంచి వస్తున్న కారులో ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించారన్నారు. వారిని కారు ఆపమనగా వారు పారిపోతుండగా వెంబడించి వారిని పట్టుకున్నామన్నారు. కారును తనిఖీ చేయగా 23 కిలోల గంజాయి ప్యాకెట్లు ఉన్నట్టు గుర్తించామన్నారు. కారులో ఉన్న ముగ్గరిని అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. అన్నమయ్య జిల్లా కలకడకు చెందిన మహబూబ్ బాషా, ఒడిశాకు చెందిన క్షత్రియ, దిలీప్‌గా గుర్తించారు. వీరు ఒడిశా నుంచి గంజాయి తీసుకొచ్చి తడ, తిరుపతి, శ్రీకాళహస్తిలలో విక్రయిస్తున్నట్టు చెప్పారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.20లక్షలు ఉంటుందని తెలిపారు. అలాగే రూ.50వేల నగదు, మూడు సెల్ ఫోన్లు, కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ దాడుల్లో హెడ్ కానస్టేబుల్ నాగరాజు నాయుడు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

యాక్సిడెంట్ ఫ్రీ అవార్డులు అందించండి


నాగ్యానాయక్‌ను సన్మానం

రేణిగుంట, సెప్టెంబరు 15: రైల్వేశాఖలో సేఫ్టీ కేటగిరీలో విధులు నిర్వహించి రిటైర్డ్ అయిన విశ్రాంత ఉద్యోగులకు యాక్సిడెంట్ ఫ్రీ అవార్డులను అందించాలని రైల్వే విశ్రాంత ఉద్యోగులు రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్ మేనేజర్ నాగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఆదివారం రేణిగుంట రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించేందుకు రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్ అధికారి నాగ్యనాయక్ వచ్చారు. ఈ సందర్భంగా రైల్వేలో సేఫ్టీ కేటగిరిలో విధులు నిర్వహించి సర్వీసులు ఇక్కడ యాక్సిడెంట్లు చేయకుండా ఉద్యోగ విరమణ చేసిన వారికి యాక్సిడెంట్ ఫ్రీ అవార్డులు, నగదు అందజేయాలని విజ్ఞప్తి చేస్తూవినతిపత్రం అందజేశారు.

కేంద్ర హెల్త్ సెక్రటరీకి స్వాగతం



రేణిగుంట, సెప్టెంబరు 15: కేంద్ర హెల్త్, ఫ్యామిలీ, వెల్ఫేర్ సెక్రటరీకి అపూర్వ చంద్రకు తిరుపతి విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. ఆదివారం మధ్యాహ్నం ఢిల్లీ నుంచి ఆయన రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు కలెక్టర్ వెంకటేశ్వర్, డీఎంఅండ్‌హెచ్‌వో శ్రీహరి స్వాగతం పలికారు. రోడ్డు మార్గాన ఆయన శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వెళ్లారు.

గురుకుల పాఠశాల తనిఖీ

రేణిగుంట, సెప్టెంబరు 15:రేణిగుంట పాత విమానాశ్రయం సమీపంలో ఉన్న గురుకుల పాఠశాలను ఎస్టీ కమిషన్ సభ్యుడు పడిత్య శంకర్‌నాయక్ సందర్శించారు. ఆదివారం సాయంత్రం గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలోని తరగతి గదిలో విద్యార్థుల నైపుణ్యాన్ని తెలుసుకున్నారు. అనంతరం భోజనశా, పడకగది, తాగునీరు లోటుపాట్లను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పిల్లలకు మెరుగైన వైద్యాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీడబ్ల్యూవో సూర్యనారాయణ, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ హరిబాబు, స్కూల్ కమిటీ చైర్మన్ రాజేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కేసుల నుంచి ఎమ్మెల్యే బయటపడాలని ప్రార్థనలు

కేవీబీపురం/ వరదయ్యపాళెం, సెప్టెంబరు 15: మండలంలోని కళత్తూరులో ఆదివారం ఎమ్మెల్యే ఆదిమూలం ఆరోగ్యం బాగుపడాలని క్రీస్తుసంఘ సభ్యులు, టీడీపీ నాయకులు ప్రార్థనలు చేశారు. అక్రమ కేసులను పెట్టిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మణి, సాధు, జనసేన నాయకులు థామస్, పరమశివం, గుణ తదితరులు పాల్గొన్నారు. వరదయ్యపాళెం మండలంలోని బత్తలవల్లం హెబ్రోన్ ప్రార్థన మందిరంలో ఆదివారం ఎమ్మెల్యే ఆదిమూలం కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేపై పడిన నిందలు తొలగిపోవాలని ఏసుక్రీస్తును ప్రార్థించారు.

ఇందిరానగర్ పంచాయతీ నిధులు...

పోలీసు బందోబస్తు నడుమ రేపు విచారణ

వరదయ్యపాళెం, సెప్టెంబరు 15: తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాలతో ఈ నెల 17వ తేదీ మంగళవారం ఇందిరానగర్ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై పోలీసుల బందోబస్తు నడుమ విచారణ చేపట్టనున్నారు. ఈ బృందంలో ముగ్గురు సభ్యులుంటారు. సీసీఆర్ బృందం వలంటీరు ఆషా నిధుల దుర్వినియోగం కేసులో పలుమార్లు కలెక్టర్ కార్యాలయం చుట్టు తిరిగింది. ఈ నేపథ్యంలో గతంలో కూడా రెండు సార్లు విచారణ చేపట్టారు. 17వ తేదీ కలెక్టర్ ఆదేశాలతో మళ్లీ విచారణ చేపట్టనున్నారు.